క్లుప్తంగా

నిరుపేదలకు ఆసరాగా సీఎంఆర్ఎఫ్



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్:నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చేయూత అందిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిమ్స్‌లో చికిత్స నిమిత్తం రూ.75 వేల విలువ గల ఎల్‌వోసీని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలె చందు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్ అనురాధ

రాయికల్: పట్టణంలోని 11వ వార్డులోని బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని వార్డు కౌన్సిలర్ మ్యాకల అనురాధ కలిసి వినతిపత్రం అందజేశారు. డ్రెయినేజీ లేకపోవడంతో విద్యార్థులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నవించారు. ఆమె వెంట నాయకులు మ్యాకల రమేశ్, బత్తిని భూమయ్య ఉన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా గోవులు రవాణా జరగకుండా పోలీసులు, పశుసంవర్ధక శాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయ సమీపంలోని జిల్లా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి మనీషా మాట్లాడుతూ గోవధ నిషేధ,పశు సంరక్షణ చట్టం ప్రకారం గోవులను,దూడలను చంపకూడదన్నారు. పశువులను తరలించాలంటే పశువైద్యాధికారి ధ్రువపత్రం,రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి



ఈద్గా పరిసరాలు శుభ్రం చేస్తున్న కార్మికులు

మెట్‌పల్లి: బక్రీద్ పండుగను పురస్కరించుకుని పట్టణ శివారులోని ఈద్గా వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం కార్మికులతో పిచ్చి మొక్కలను తొలగించి ఈద్గా పరిసరాలను శుభ్రం చేయించారు. ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేసుకోవడానికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ముజీబ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన



బడిబాట ర్యాలీలో విద్యార్థులు, నాయకులు

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన జరుగుతుందని జగిత్యాల సింగిల్ విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోరపల్లిలో జిల్లా పరిషత్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతో పాటు, ఉచిత పుస్తకాలు, డ్రెస్‌లు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బన్న, శ్రీనివాసమూర్తి, సెక్రటరీ రాజిరెడ్డి, గ్రామస్తులు గణేశ్, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.



నమో నారసింహ

ధర్మపురి: జ్యేష్ఠ శుద్ధ నవమి సందర్భంగా శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రద్దీ నెలకొంది. భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.



అంజన్నకు మొక్కులు

కొండగట్టు: అంజన్న సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారికి సింధూర పూజలు చేసి తమలపాకులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



హనుమంతునికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

వర్షాలు కురవాలని పూజలు

మెట్‌పల్లిరూరల్: వర్షాలు కురవాలని మెట్‌పల్లి మండలం వెల్లులలో గ్రామస్తులు శనివారం పూజలు నిర్వహించారు. గ్రామంలోని దేవత మూర్తులకు గంగజలాలతో జలాభిషేకం చేశారు. గ్రామస్తులు హనుమాన్,పోచమ్మ,సార్గమ్మ, శివాలయ, తదితర దేవతామూర్తులకు జలాభిషేకం చేసి, అనంతరం దసరాగుట్టపై లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని వరుణదేవున్ని వేడుకున్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి ఊరేగింపు, ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శనివారం డీఈవో జగన్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్రమ్, సంజయ్, నా గరాజు, రాహుల్, నితిన్, రాజేశ్, తరుణ్, సతీశ్, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

జగిత్యాలరూరల్: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్ కోరారు. శనివారం జిల్లా పంచాయతీ అధి కారి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా, ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. ఒకటో పీఆర్సీలో నిర్ణయించిన 30 శాతం వేతనాలు అందించాలని, కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పులి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు రాజేందర్, కని కారపు సత్తయ్య, గుడిసె దేవయ్య, కొత్తూరి కొండయ్య, చిట్యాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అదనపు కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: బుగ్గారం మండల కేంద్రంలో నెలకొన్న అభివృద్ధి పనులపై శనివారం మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ చుక్క గంగారెడ్డి శనివారం అదనపు కలెక్టర్ రాంబాబుకు వినతిపత్రాలు సమర్పించారు. వాటిలో బుగ్గారం మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)ను గత కొంత కాలం నుంచి ఏర్పాటు చేయాలని ఎన్నో సార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ, నేటికి నిర్మించలేదని పేర్కొన్నారు. బుగ్గారంలో చేపడుతున్న డబుల్ రోడ్డు నిర్మాణాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని నాణ్యత లోపంతో రోడ్డు పనులు చేపడుతున్నారని, డబుల్ రోడ్డు ఎత్తుగా పోయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్డు పనులపై రోడ్డు భవనాల శాఖ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ధర్నా చేయడానికి అనుమతివ్వాలని జిల్లా అధికారి శ్రీనివాస్‌ను కోరారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని శ్రీహితను సన్మానిస్తున్న ఎంపీటీసీ ఆంజనేయులు, ఉపాధ్యాయులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కూన శ్రీహిత అనే విద్యార్థిని జాతీయ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడంతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించగా.. కూన శ్రీహిత మంచి మార్కులు సాధించారన్నారు. శ్రీహితకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ వస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆంజనేయులు, పాఠశాల కమిటీ చైర్మన్ తిరుపతమ్మ, హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని వినతి



ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: కోరుట్ల- వేములవాడ రోడ్డుపై కథలాపూర్ మండలం కలిగోట గ్రామశివారులో పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు శనివారం ఎస్సై నవీన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. బక్రీద్ సందర్భంగా గోవులను అక్రమంగా తరలించకుండా చెక్‌పోస్టు ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్యాల మారుతి, గంగ్ర విజయ్‌రావు, కాసోజి ప్రతాప్, ఆల్గోట్ ప్రమోద్, మల్యాల శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్స్ తయారీలో మహిళల పాత్ర అమోఘం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు

- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్‌రావు

జగిత్యాలజోన్/జగిత్యాలరూరల్: ఏకరూప దుస్తుల తయారీలో మహిళా పాత్ర అమోఘమని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే క్యాంటీన్లను కూడా మహిళా సంఘాలకే ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మహిళా శక్తి కుట్టు కేంద్రాల ద్వారా ఏకరూప దుస్తులు తయారు చేసి సకాలంలో ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమాల్లో కూడా మహిళా సంఘాల ప్రతినిధులు చురుకుగా పాల్గొంటున్నారని కితాబునిచ్చారు. సమావేశంలో జిల్లా ఏపీడీ చరణ్‌దాస్, డీపీఎంలు మానిక్‌రెడ్డి, విజయలక్ష్మి, వెంకటేశ్, మల్లేశ్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు డబ్బులివ్వొద్దు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

జగిత్యాల: జాతీయ ఆరోగ్య మిషన్‌లో పర్మినెంట్‌గా ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.లక్ష వరకు తీసుకున్నట్లు వస్తున్న ఆరోపణలను నమ్మవద్దని ఏఐటీయూసీ నాయకులు మహేశ్, పద్మ అన్నారు. శనివారం కార్యాలయంలో మాట్లాడుతూ ఎలాంటి వ్యక్తులైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటే నమ్మవద్దని, డబ్బులిచ్చి మోసపోవద్దన్నారు. కొన్ని అవాస్తవ ప్రచారాలు వస్తున్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో జ్యోతి, తిరుమలేశ్, సంతోష్, చందు పాల్గొన్నారు.

మల్లాపూర్- హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



మంత్రి పొన్నంకు వినతి పత్రం ఇస్తున్న కృష్ణారావు

కోరుట్ల: మల్లాపూర్ మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నంను కలిసి వినతిపత్రం అందజేశారు.

మోడల్ స్కూల్‌లో తెలుగు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో తెలుగు బోధించడానికి ఈ నెల 18 వరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నవీన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ, బీఎడ్ అర్హతలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా వాసవీమాతా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

మెట్‌పల్లి: పట్టణంలోని వాసవీ మాత ఆలయ 44 వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు భాస్కర్ శర్మ, బాలకృష్ణశర్మల ఆధ్వర్యంలో నవగ్రహ, కలశ పూజలతో పాటు పూర్ణాహుతి, పంచామృతాభిషేకం చేయించారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గెజిటెడ్ జూనియర్ లెక్చరర్లు

జగిత్యాల: విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ – 475 నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంటర్‌మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని, దీంతో వ్యయభారం తగ్గిందన్నారు. అలాగే విద్యార్థుల కోసం కళాశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొట్టాల తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలి

జగిత్యాల: ఇంటర్‌మీడియట్ మూల్యాంకనం కోసం ప్రత్యేక భవన నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి జూనియర్ లెక్చరర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగిత్యాలలో నూతనంగా ఇంటర్‌మీడియట్ మూల్యాంకణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ప్రత్యేక భవన సదుపాయం కల్పించాలని, దీని వల్ల జవాబు పత్రాలు పొందుపర్చడానికి భవనం ఉంటేనే బాగుంటుందన్నారు. ఎమ్మెల్సీ స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

ఐసెట్‌లో కోరుట్ల విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ర్యాంకు



విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలకు చెందిన పల్లెం మాధురి ఐసెట్ 2024 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 740 ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మాధురిని కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్, అధ్యాపకులు అభినందించారు.

వాగు పరీవాహక ప్రాంతానికి హద్దులు నిర్ణయించాలి

కోరుట్ల: పట్టణ శివారులోని పెద్ద వాగు పరీవాహక ప్రాంతాన్ని కొలిచి హద్దులు నిర్ణయించాలని డిప్యూటీ ఎగ్జికూటీవ్ ఇంజనీర్ తిరుమల కుమార్ కోరుట్ల తహసీల్దార్‌కు లేఖను పంపారు. కోరుట్ల పెద్ద వాగు ప్రాంతంలో అక్రమంగా గోడలు నిర్మిస్తున్నారని పట్టనానికి చెందిన బీజేపీ నాయకుడు రుద్ర శ్రీనివాస్ నీటిపారుదల అధికారులకు గతంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఈఈ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయించాలని తహసీల్దార్‌ను లేఖలో కోరారు.

నిత్యావసర సరుకులు అందజేత

రాయికల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మ్యాదారపు అనిల్ అనే నిరుపేద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఉదయం ఫౌండేషన్ సభ్యులు శనివారం నిత్యావసర వస్తువులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు దనకంటి ఈశ్వర్, పంచతి రాఘవ, శ్రీధర్, రమేశ్, స్వామి పాల్గొన్నారు.

బీఎస్పీకి ముజాహిద్ రాజీనామా

కోరుట్ల: బీఎస్పీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడు, మైనార్టీ సెల్ జిల్లా కన్వీనర్ మొహమ్మద్ ముజాహిద్ శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సరైన నాయకులు లేక పోవటంతో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసే నాయకులను గుర్తించటం లేదని అందుకే రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు.

జేసీబీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

వెల్గటూర్ : మండల జేసీబీ యూనియన్ నూతన పాలకవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాజుల సుమన్, ప్రధాన కార్యదర్శిగా బచ్చల సుమన్, ఉపాధ్యక్షుడిగా బిడారి తిరుపతిని ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పాలకవర్గ యూనియన్ సభ్యులకు సుమన్ కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ముగిసిన రాజారాంపల్లి వారసంత వేలం

వెల్గటూర్ : ఎండపల్లి మండలం రాజారాంపల్లి వారసంత బహిరంగ వేలం శనివారం నిర్వహించారు. రాజారాంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన మాచర్ల మహేశ్ యాదవ్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వేలం దక్కించుకున్న మహేశ్‌ను ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, గ్రామస్తులు అభినందించారు.

ఎస్సీ ఎస్టీ కేసులో నిందితుల అరెస్ట్

వెల్గటూర్ : మండలంలోని కప్పారావుపేటలో జరిగిన దాడి ఘటనలో పరారీలో ఉన్న నిందితులు ముంజంపల్లి గ్రామానికి చెందిన బైరం తరుణ్, బైరం కరుణ్, పనుగంటి మధుకర్‌ను అరెస్ట్ చేసి శనివారం ధర్మపురి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, నిందితులకు మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను కరీంనగర్ జైలుకి తరలించినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల గ్రామ శివారులో శనివారం రాత్రి పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పోలీస్‌సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు చేశామన్నారు. 8 మంది అరెస్టు చేసి వారి నుంచి రూ. 8,650 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌మోటార్ల కాపర్ వైరు చోరీ

కథలాపూర్: మండలం ఊట్‌పెల్లి, పెగ్గెర్ల గ్రామాల శివారులో ఎస్సారెస్పీ వరదకాలువకు ఉన్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన కాపర్ వైర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు రైతులు శనివారం తెలిపారు. ఈ మేరకు పలువురు రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల వ్యవధిలో సుమారు 30 విద్యుత్ మోటార్ల కాపర్‌వైర్లు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు.

జగిత్యాలకు ఒక్క కంపెనీ తేలేరా..?



మాట్లాడుతున్న బోగ శ్రావణి

జగిత్యాల: పెద్దపల్లి జిల్లాకు అక్కడి మంత్రి రూ.700 కోట్లతో కోకో కోలా కంపెనీ తీసుకు వస్తే.. జగిత్యాలకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఒక్క ఇంటర్నేషనల్ కంపెనీ తీసుకురార అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రశ్నించారు. శనివారం మాట్లాడారు. అక్రమ నిర్మాణాలపై ఇటీవల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని కానీ, ఆ ప్రాంతంలోనే మరో ఇల్లు అక్రమంగా నిర్మిస్తున్నారని దానిపై ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజయ్ సైతం తన అనుచరుడు అక్రమ నిర్మాణం చేపడితే అతడిని వెనకేసుకుని రాద్ధాంతం చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఒక అక్రమ కట్టడం గురించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్థాయి నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జగిత్యాలలో నిర్మించిన 4,520 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు లేవన్నారు. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతి, ఆముద రాజు, అనిల్, గంగాధర్, అశోక్, మమత పాల్గొన్నారు.